సాక్షి కామారెడ్డి

మంగళవారం । 15 । అక్టోబర్ । 2024



ఫిర్యాదులను పరిష్కరించాలి

ప్రజావాణిలో నమోదయ్యే ఫిర్యాదులను వెంటనే పరిష్కరించాలని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ అధికారులను ఆదేశించారు.

- 8లో ▸



పేరుకుపోతున్న ధాన్యం

కొనుగోలు కేంద్రాలలో తూకాలు ప్రారంభం కాకపోవడంతో ధాన్యం రాశులు పేరుకుపోతున్నాయి.

- 9లో ▸

గరిష్టం/కనిష్టం
37.4 /21.2

వాతావరణం

ఉదయం ఆహ్లాదకరమైన గాలులు వీస్తాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. రాత్రి మంచు కురుస్తుంది. చలి తీవ్రత పెరుగుతుంది.

న్యూస్‌రీల్

లొట్టి పోయి బిందె వచ్చె..



లింగంపేట: కల్లు గీసి, నిల్వ చేయడం కోసం గతంలో లొట్టీలు ఉపయోగించేవారు. అయితే కులవృత్తులకు ఆదరణ తగ్గడంతో కుమ్మరులు కుండలు చేయడం తగ్గించేశారు. దీంతో కల్లు గీసేవారు మట్టి లొట్టీలకు ప్రత్యామ్నాయంగా ప్లాస్టిక్ బిందెలను వినియోగిస్తున్నారు.

108 అంబులెన్స్‌ల తనిఖీ



కామారెడ్డి టౌన్: జిల్లాకేంద్రంలో సోమవారం 108 అంబులెన్స్‌లను ఈఎంఆర్ గ్రీన్ హెల్త్ సర్వీస్, 108 వాహనాల నిర్వహణ క్వాలిటీ అధికారి సత్యనారాయణ తనిఖీ చేశారు. వాహనాల పనితీరు, రికార్డులను పరిశీలించారు. 102, 1962, ఎఫ్‌హెచ్‌ఎస్ వాహనాలను తనిఖీ చేశారు. కార్యక్రమంలో కామారెడ్డి ఈఎంఈ తిరుపతి, 108 సిబ్బంది నరేశ్, విజయ్, రాకేష్ పాల్గొన్నారు.

'రూ.10 నాణేలను తిరస్కరిస్తే చర్యలు'



నాగిరెడ్డిపేట: దుకాణదారులు ఎవరూ రూ.10 నాణేలను తిరస్కరించవద్దని నాగిరెడ్డిపేట యూనియన్ బ్యాంకు మేనేజర్ సాగర్ షిండే, అసిస్టెంట్ మేనేజర్ సందీప్ పేర్కొన్నారు. సోమవారం గోపాల్‌పేటలోని పలు దుకాణాల వద్ద రూ.10 నాణేల చలామణికి సంబంధించి స్టిక్కర్లను అతికించారు. రూ.10 నాణేలను ప్రతి దుకాణదారుడు తప్పనిసరిగా తీసుకోవాలని సూచించారు. నాణేలను తీసుకోవడానికి తిరస్కరిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

వృత్తి విద్య కోర్సులలో శిక్షణ

కామారెడ్డి క్రైం: సెట్విన్ టెక్నికల్ ఇన్‌స్టిట్యూట్ ఆధ్వర్యంలో యువతకు వృత్తి విద్యా కోర్సులలో శిక్షణ ఇవ్వనున్నట్లు సంస్థ జిల్లా కోఆర్డినేటర్ సయ్యద్ మొయినుద్దీన్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. డీసీఏ, పీజీడీసీఏ, టైలరింగ్, ఫ్యాషన్ డిజైనింగ్ బ్యూటీషియన్, మగ్గం వర్క్, మెహందీ కోర్సులలో శిక్షణ ఇస్తామని పేర్కొన్నారు. కోర్సు ఫీజులో 50 శాతం రాయితీ అవకాశం ఉందని, ఉచితంగా స్టడీ మెటీరియల్ అందిస్తామని తెలిపారు. ఆసక్తి గలవారు 73861 80456, 79891 59121 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటరుగా నమోదు చేసుకోవాలి

నిజామాబాద్ అర్బన్ : ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు వేసేందుకు అర్హులైన ఉపాధ్యాయులు నమోదు చేసుకోవాలని తపస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామకృష్ణారెడ్డి సూచించారు. సోమవారం ఆర్‌ఎస్‌ఎస్ కార్యాలయంలో తపస్ కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 317 జీవో ఉపాధ్యాయులను వారి సొంత జిల్లాకు పంపాలని డిమాండ్ చేశారు.

డెత్ గేమ్స్!

కామారెడ్డి మున్సిపాలిటీ పరిధిలోని దేవునిపల్లికి చెందిన ఓ యువకుడు ఆన్‌లైన్ గేమ్స్‌లో భారీగా నష్టపోయాడు. ఉన్న ఆస్తులు ఊడ్చుకుపోగా.. మరో రూ.15 లక్షలకుపైగా అప్పులు చేశాడు. అప్పులు తీర్చే మార్గం తెలియక ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కొడుకును కోల్పోయిన తల్లిదండ్రులకు కడుపుకోతే మిగిలింది.

బాన్సువాడ పట్టణంలో ఓ యువకుడు ఆన్‌లైన్‌లో ఆటలాడి రూ.8 లక్షలు అప్పులు చేశాడు. అప్పులు తీర్చే మార్గం కానరాక నగలు దొంగతనం చేయడానికి వెళ్లి ఓ మహిళను హతమార్చి జైలుపాలయ్యాడు.

ఎల్లారెడ్డి మండలంలో ఓ యువకుడు ఆన్‌లైన్ గేమ్‌లతో తీవ్రంగా నష్టపోయి అప్పులపాలయ్యాడు. అప్పు తీర్చే మార్గం లేకపోవడంతో కుటుంబ సభ్యులకు చెప్పకుండా ఎటో వెళ్లిపోయాడు. దీంతో కుటుంబ సభ్యులు ఆందోళనకు గురయ్యారు. చివరకు ఆచూకీ దొరికిన తరువాత జరిగిన విషయం తెలుసుకుని అతడిని సముదాయించారు.



ఆన్‌లైన్ గేమింగ్ సరదాగా మొదలై.. క్రమంగా వ్యసనంగా మారుతోంది. ఓటములే తప్ప విజయాలు కనిపించని జూదంలో కొందరు కసిగా ఆడుతూ ఉన్నదంతా పోగొట్టుకుంటున్నారు. అప్పులు చేసి మరింత ఊబిలో కూరుకుపోతున్నారు. అప్పులు తీర్చేందుకు కొందరు అడ్డదారులు తొక్కుతుండగా.. మరికొందరు జీవితాలను అర్ధంతరంగా ముగిస్తున్నారు.

– సాక్షి ప్రతినిధి, కామారెడ్డి

- ఆన్‌లైన్ ఆటలకు బానిసలవుతున్న జనం
- రూ.లక్షలు పోగొట్టుకుని అప్పుల ఊబిలో కూరుకుపోతున్న వైనం
- అప్పులు తీర్చేందుకు అడ్డదారులు తొక్కుతున్న కొందరు..
- జీవితాలను అర్ధంతరంగా ముగిస్తున్న మరికొందరు..

సులువుగా డబ్బు సంపాదించాలన్న అత్యాశతో యువకులు ఆన్‌లైన్ గేమ్‌లతో రూ.లక్షలు పోగొట్టుకుని బతుకులు ఆగం జేసుకుంటున్నరు. ఇటీవలి కాలంలో చాలామంది యువకులు ఆన్‌లైన్ గేమ్స్‌కు అలవాటుపడి అప్పుల ఊబిలో కూరుకుపోతున్నారు. జిల్లాలో ఇటీవలి కాలంలో జరిగిన పలు సంఘటనలను పరిశీలిస్తే ఆన్‌లైన్ ఆటలతో ఎంతో మంది జీవితాలు బలవుతున్నట్టు స్పష్టమవుతోంది. పల్లె, పట్నం తేడా లేకుండా అన్ని ప్రాంతాల్లో యువకులు పొద్దస్తమానం చేతిలో సెల్‌ఫోన్ పట్టుకుని ఆన్‌లైన్ ఆటల్లో మునిగి తేలుతున్నారు. కొందరు విద్యార్థులు కూడా ఆన్‌లైన్ గేమ్‌లకు అలవాటు పడి చదువులను నాశనం చేసుకుంటున్నారు. దాదాపు అందరి చేతుల్లో ఉన్న స్మార్ట్ ఫోన్లకు ఏదో ఒక గేమ్‌కు సంబంధించిన మెసేజ్‌లు వస్తున్నాయి. దాన్ని క్లిక్ చేస్తే చాలు సులువుగా డబ్బుల సంపాదించుకోవచ్చునని వస్తున్న యాడ్స్ వాళ్లను ఆటవైపు మరలేలా చేస్తున్నాయి. ఆటతో రూ.లక్షలు సంపాదించవచ్చనే భ్రమల్లో చాలామంది పడిపోతున్నారు. దీంతో చాలా మంది వాటిని నమ్మి ఆ ఊబిలో దిగి కూరుకుపోతున్నారు. తేరుకునేసరికి అప్పులు కుప్పవుతున్నాయి.

అప్పులు తీర్చే దారి తెలియక..

అప్పులు తీర్చలేక కొందరు బాధితులు మృత్యువును ఆశ్రయిస్తున్నారు. ముఖ్యంగా యువకులు లేని ఆశలకు పోయి ఆన్‌లైన గేముల్లో రూ.లక్షలు కోల్పోయి రోడ్డున పడ్డారు. కుటుంబ సభ్యులకు సమాధానం చెప్పలేక, అప్పులు తీర్చే మార్గం కానరాక పలువురు ఆత్మహత్యలకు పాల్పడ్డారు. దీంతో వారి కుటుంబాలు రోడ్డున పడుతున్నాయి. కామారెడ్డి జిల్లా కేంద్రం పరిధిలో ఇప్పటికే ఐదారుగురు యువకులు ఆన్‌లైన్ గేమ్‌లతో నష్టపోయి ఆత్మహత్యలకు పాల్పడినట్టు తెలుస్తోంది. ఫోన్‌లతో ఎక్కువ సేపు కాలక్షేపం చేస్తున్న వారిలో చాలామంది ఆన్‌లైన్ గేమ్‌లు ఆడుతుండడం ఆందోళన కలిగిస్తోంది. ఈ నేపథ్యంలో తల్లిదండ్రులు దృష్టి సారించి, ఈ వ్యసనానికి దూరం చేయాల్సిన అవసరం ఉందన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది.

నేరాలబాట

జిల్లాలో ఆన్‌లైన్ గేమ్‌ల మూలంగా వందలాది మంది అప్పులపాలైనట్టు తెలుస్తోంది. పట్టణాలే కాకుండా మారుమూల గ్రామాల్లో సైతం యువకులు, విద్యార్థులు ఆన్‌లైన్ గేముల్లో రూ.లక్షలకు లక్షలు పోగొట్టుకున్నారు. ఊరూరా ఆన్‌లైన్ గేమ్స్ బాధితులే కనిపిస్తున్నారు. తెలిసిన వారి దగ్గర అప్పులు చేసి మరీ ఆటల్లో పెట్టుబడులు పెడుతుండడం గమనార్హం. రూ.10తో మొదలై రూ.లక్షల వరకు ఆడుతున్నారు. ఒక్కోసారి ఆట తమకు అనుకూలంగా ఉందనగానే రెచ్చిపోయి మరీ ఎంతంటే అంత తగలేస్తున్నారు. కుటుంబ సభ్యులకు తెలియకుండా అప్పులు చేసిన వారిలో కొందరు అప్పు తీర్చేందుకు అడ్డదారులు తొక్కుతున్నారు. మహిళల మెడల్లోంచి ఆభరణాలు లాక్కెళ్లే ప్రయత్నంలో ఒకరిద్దరు పోలీసులకు చిక్కారు. దీంతో బతుకు జైలుపాలైన సంఘటనలున్నాయి. జిల్లాలో జరుగుతున్న దొంగతనాలు, ఇతర నేరాల్లో కొందరు ఆన్‌లైన్ గేమ్‌లలో నష్టపోయిన బాధితులు ఉన్నట్టు ఇటీవల జరిగిన సంఘటనలు రుజువు చేస్తున్నాయి.

నేడు నూతన టీచర్లకు కౌన్సెలింగ్

- ఉదయం ఎస్‌ఏలు, మధ్యాహ్నం ఎస్జీటీలకు..

సాక్షి ప్రతినిధి, కామారెడ్డి/కామారెడ్డి టౌన్ : ఉపాధ్యాయుల నియామక ప్రక్రియ చివరి అంకానికి చేరుకుంది. మంగళవారం ఎంపికైనవారికి కౌన్సెలింగ్ ద్వారా స్థానాలను కేటాయించనున్నారు. డీఎస్సీలో సాధించిన మార్కుల ఆధారంగా ఒక్కో పోస్టుకు ముగ్గురిని పిలిచి వారి సర్టిఫికెట్లను ఈనెల 2 నుంచి 5వ తేదీ వరకు పరిశీలించారు. జిల్లాలో 506 పోస్టులకుగాను 1,157 మంది సర్టిఫికెట్ల పరిశీలనకు హాజరయ్యారు. ఈనెల 8న ఎంపిక చేసిన అభ్యర్థుల జాబితాను ప్రకటించారు. మొత్తం 506 పోస్టుల భర్తీకోసం డీఎస్సీ నిర్వహించగా.. 443 మంది ఈనెల 9న నియామక పత్రాలను అందుకున్నారు. వీరిలో 438 మంది డీఈవో కార్యాలయంలో రిపోర్టు చేశారు. వీరికి మాత్రమే మంగళవారం కలెక్టరేట్‌లోని మీటింగ్ హాల్‌లో కౌన్సెలింగ్ నిర్వహించనున్నట్లు డీఈవో రాజు తెలిపారు. మిగిలిన అభ్యర్థులలో ఎల్‌ఆర్‌ఆర్ నంబర్ అందుకోని వారు, మెడికల్ పరీక్షలకు వెళ్లిన వారు ఉన్నారన్నారు. వారికి త్వరలోనే కౌన్సెలింగ్ ఉంటుందని తెలిపారు.

ఉదయం 9 గంటలనుంచి..


డీఎస్సీ – 2024 కు ఎంపికై అపాయింట్‌మెంట్ ఉత్తర్వులు పొందిన నూతన టీచర్లు కౌన్సెలింగ్‌కు హాజరు కావాలని డీఈవో రాజు సూచించారు. కలెక్టరేట్‌లోని మీటింగ్ హాల్‌లో కౌన్సెలింగ్‌కు అన్ని ఏర్పాట్లు చేశామని పేర్కొన్నారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 1 గంటల వరకు స్కూల్ అసిస్టెంట్లకు కౌన్సెలింగ్ ఉంటుందని తెలిపారు. తెలుగు, హిందీ, ఇంగ్లిష్, ఉర్దూ, మరాఠీ లాంగ్వేజ్‌లతో పాటు అన్ని సబెక్ట్‌ల ఎస్‌ఏలు, ఫిజికల్ డెరెక్టర్‌లు, లాంగ్వేజ్ పండిత్‌లు, పీఈటీలు హాజరుకావాలని సూచించారు. ఎస్జీటీలకు మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం వరకు కౌన్సెలింగ్ ఉంటుందని పేర్కొన్నారు. తెలుగు, ఉర్దూ, మరాఠీ, స్పెషల్ ఎడ్యుకేషన్ ఎస్జీటీలు సమయానికి హాజరు కావాలని పేర్కొన్నారు. ప్రతి ఉపాధ్యాయుడు 3 పాస్‌పోర్టు సైజ్ ఫొటోలు, ఒరిజినల్ అపాయింట్‌మెంట్ లెటర్ తీసుకుని సమయానికి కౌన్సెలింగ్‌కు హాజరుకావాలని సూచించారు.

అక్రమాలకు ఆస్కారం!

జిల్లా విద్యాశాఖ అక్రమాలకు నిలయంగా మారింది. ఈ నేపథ్యంలో కౌన్సెలింగ్‌లోనూ అక్రమాలు జరిగే అవకాశాలు ఉన్నాయన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. పోస్టింగ్‌ల విషయంలోనూ అక్రమాలు జరిగే అవకాశం ఉంది. డిప్యుటేషన్ల మీద వివిధ స్కూళ్లలో పనిచేస్తున్న వారి కోసం ఆయా పోస్టులను బ్లాక్ చేసి, అక్రమాలకు తెరలేపుతారన్న ప్రచారం జరుగుతోంది. అక్రమంగా డిప్యుటేషన్లపై కొనసాగుతున్న వారిని తిరిగి సొంత స్థానాలకు పంపించి, ఖాళీగా ఉన్న వాటిని భర్తీ చేయాలని విద్యాభిమానులు కోరుతున్నారు.

దసరాకు ఫుల్‌గా తాగేశారు

- ఉమ్మడి జిల్లాలో జోరుగా మద్యం విక్రయాలు



ఖలీల్‌వాడి : దసరాకు ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో మద్యం అమ్మకాలు జోరుగా సాగాయి. ప్రజలు పండుగకు రెండు, మూడు రోజుల ముందుగానే గ్రామాలకు చేరకోవడంతో స్నేహితులు, బంధువులతో కలిసి మద్యం తాగారు. మద్యం ప్రియులు మద్యాన్ని ఎక్కువ మొత్తంలో కొనుగోలు చేశారు. గతేడాది కంటే ఈసారి మద్యం అమ్మకాలు ఎక్కువగా జరిగినట్లు ఎక్సైజ్ వర్గాల ద్వారా తెలిసింది. జిల్లాలోని 151 మద్యం దుకాణాలు, 21 బార్లు ఉన్నాయి. శనివారం దసరా రావడంతో ఉపవాసాలు ఉన్నవారు పండుగను కొందరు శుక్రవారం, మరికొంత మంది ఆదివారం చేసుకున్నారు. ఈ మూడు రోజుల్లో ఐఎంఎల్ డిపో నుంచి మద్యం విక్రయాలు జోరుగా సాగాయి. శనివారం పండుగ సందర్భంగా డిపో బంద్ ఉంది. కాగా అంతకు ముందు మూడు రోజుల్లో డిపో నుంచి రూ.21.48 కోట్ల విలువైన మద్యం వైన్‌షాపులు, బార్లకు తీసుకెళ్లారు.

ఐఎంఎల్ డిపోలో మద్యం విక్రయాల వివరాలు..

రోజు	లిక్కర్ (కేసుల్లో)	బీర్లు (కేసుల్లో)	ఆదాయం (రూ.)
బుధవారం	5,063	9,574	5,48,00,000
గురువారం	4,598	9,211	5,12,00,000
శుక్రవారం	10,412	17,803	10,88,00,000

'అందరికీ రుణమాఫీ జరిగి తీరుతుంది'

బాన్సువాడ : అర్హులందరికీ కచ్చితంగా పంట రుణాలు మాఫీ చేస్తామని వ్యవసాయ సలహాదారు పోచారం శ్రీనివాస్‌రెడ్డి పేర్కొన్నారు. సోమవారం బాన్సువాడ సహకార సంఘం ఆధ్వర్యంలో మార్కెట్ కమిటీ ఆవరణలో అగ్రో ఇండస్ట్రీస్ చైర్మన్ కాసుల బాల్‌రాజ్‌తో కలిసి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్థిక పరమైన సమస్యలతో రైతులకు రూ. 2 లక్షల వరకు రుణమాఫీ జరగడంలో కొంత ఆలస్యమైందన్నారు. ఇచ్చిన మాట ప్రకారం ప్రభుత్వం రుణమాఫీ చేసి తీరుతుందన్నారు. ప్రభుత్వం సరఫరా చేస్తున్న దొడ్డు రకం బియ్యాన్ని ప్రజలు తినలేని పరిస్థితి ఉన్నందున సన్న రకం ధాన్యం సాగును ప్రోత్సహించేందుకు రూ. 500 బోనస్ ఇస్తోందన్నారు. ప్రస్తుతం నిజాంసాగర్‌లో పుష్కలంగా నీరున్నందున వచ్చే యాసంగి, వానాకాలం పంటలకు ఢోకా లేదన్నారు. రైతులు ముందస్తు నాట్లు వేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ జంగం గంగాధర్, నాయకులు కృష్ణారెడ్డి, అంజిరెడ్డి, ఎజాస్, పిట్ల శ్రీధర్, గోపాల్‌రెడ్డి, నాగులగామ వెంకన్న, నార్ల రవీందర్, నార్ల సురేశ్ గుప్తా, మోహన్ నాయక్, విఠల్‌రెడ్డి, దాసరి శ్రీనివాస్, సాయిలు యాదవ్ తదితరులు పాల్గొన్నారు.



ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి

వచ్చేనెలలో పత్తి కొనుగోళ్లు

- కొనుగోలు కేంద్రాలపై ప్రచారం చేయాలి
- కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్

కామారెడ్డి క్రైం: వచ్చేనెల మొదటి వారంలో జిల్లాలో పత్తి కొనుగోళ్లు ప్రారంభించడానికి అన్ని ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ అధికారులకు సూచించారు. సోమవారం కలెక్టరేట్‌లో వివిధ శాఖల అధికారులు, జిన్నింగ్ మిల్లుల యజమానులతో కలెక్టర్ సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పత్తి ధర క్వింటాలుకు రూ.7,521 గా సీసీఐ నిర్ణయించిందన్నారు. జిల్లాలో దాదాపు 2.36 లక్షల క్వింటాళ్ల పత్తి దిగుబడి వచ్చే అవకాశం ఉందని పేర్కొన్నారు. బహిరంగ మార్కెట్‌లో ప్రస్తుతం పత్తి ధర క్వింటాలుకు రూ.7,500 లకుపైగా ఉన్నట్లు తెలుస్తోందన్నారు. జిల్లాలోని మద్నూర్ వ్యవసాయ మార్కెట్ పరిధిలో 8 జిన్నింగ్ మిల్లులు ఉన్నాయని, కొనుగోలు చేసిన పత్తిని ఆయా మిల్లులకు పంపిస్తామని పేర్కొన్నారు. కొనుగోలు కేంద్రాలకు సంబంధించి విస్తృతంగా ప్రచారం నిర్వహించాలని మార్కెటింగ్ అధికారులకు సూచించారు. అగ్నిమాపక యంత్రాలను అందుబాటులో ఉంచాలని మిల్లర్లకు సూచించారు. అనంతరం పత్తి కొనుగోళ్లకు సంబంధించిన పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, మార్కెటింగ్ అధికారి రమ్య, డీపీవో తిరుమల ప్రసాద్, సీసీఐ ఇన్‌చార్జి ఓబుల్‌రెడ్డి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



పత్తి కొనుగోళ్లకు సంబంధించిన పోస్టర్లను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్, జిల్లా అధికారులు

జిల్లాలో 419 ధాన్యం కొనుగోలు కేంద్రాలు..

కామారెడ్డి క్రైం: జిల్లాలో ఈ ఖరీఫ్ సీజన్‌లో 419 వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయనున్నట్లు కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ తెలిపారు. కలెక్టరేట్‌లో సంబంధిత శాఖల అధికారులతో సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సహకార సంఘాల ఆధ్వర్యంలో 392 కొనుగోలు కేంద్రాలు, ఐకేపీ ఆధ్వర్యంలో 27 కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నామన్నారు. కేంద్రాల వద్ద మౌలిక సదుపాయాలు సమకూర్చాలని సూచించారు. రెండు, మూడు రోజుల్లో వరి కొనుగోలు కేంద్రాల ఏర్పాటు పూర్తి చేసి కొనుగోళ్లు ప్రారంభించాలన్నారు. మిల్లర్లతో ఎప్పటికప్పుడు మాట్లాడుతూ సీఎంఆర్ సేకరణ పూర్తి చేయాలన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, సివిల్ సప్లయ్ డీఎం రాజేందర్, డీఏవో తిరుమల ప్రసాద్, డీఆర్‌డీవో సురేందర్, మార్కెటింగ్ అధికారి రమ్య, సహకార, రెవెన్యూ శాఖల అధికారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ సంగ్వాన్

తొమ్మిది నెలల్లో ఎన్నో సంక్షేమాలు

- జిల్లాకు త్వరలోనే యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్
- కుల గణన తర్వాతే స్థానిక సంస్థల ఎన్నికలు
- టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్

నిజామాబాద్ సిటీ : జిల్లా ప్రజలకు దసరా కానుకగా ప్రభుత్వం త్వరలోనే యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ మంజూరు చేయనుందని పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ తెలిపారు. సోమవారం ఆయన జిల్లా కాంగ్రెస్ భవన్‌లో మీడియాతో మాట్లాడారు. తెలంగాణ రాష్ట్రం తెచ్చుకున్నదే నీళ్లు, నిధులు, నియామకాల కోసమని, వాటి అమలుకు కాంగ్రెస్ ప్రభుత్వం అహర్నిశలు శ్రమిస్తోందన్నారు. ఇప్పటికే దాదాపు 49 వేల ఉద్యోగాలు ఇచ్చామన్నారు. రైతు రుణమాఫీపై విపక్షాలు ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నాయని, రుణమాఫీపై మాజీ మంత్రి హరీశ్ రావు విమర్శలు చేయడం తగదన్నారు. పదేళ్ల బీఆర్‌ఎస్ కాలంలో రైతుల కోసం ఖర్చు చేసిన నిధులెన్ని.. 9 నెలల కాంగ్రెస్ పాలనలో రైతు రుణమాఫీ కోసం చేసిన నిధులెన్నో ప్రజలు గుర్తించాలన్నారు. బీఆర్‌ఎస్ సోషల్ మీడియా సెన్స్ లేని మీడియాగా తయారైందని ఆగ్రహం వ్యక్తంచేశారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, రూ.500లకే సిలిండర్ వంటి పథకాలు విజయవంతంగా అమలు చేస్తున్నామన్నారు. మేనిఫెస్టోలో లేని హామీలను కూడా తమ సర్కారు అమలు చేస్తోందన్నారు. ఎన్నికల సమయంలో రాజకీయాలు చేశామని, ఇప్పుడు అభివృద్ధి వైపు దృష్టి పెడదామని పేర్కొన్నారు. నిజామాబాద్ ఎంపీ కేంద్ర నిధులు పూర్తిగా మంజూరు చేయించి రైల్వే ఓవర్ బ్రిడ్జిలు సత్వరం నిర్మాణం అయ్యేలా చూడాలన్నారు. జిల్లాకు రావాల్సిన స్మార్టు సిటీని తీసుకువచ్చేలా ఎంపీ అర్వింద్ కృషి చేయాలని సూచించారు.

జిల్లాకు మరో మెడికల్ కళాశాల, ఇంజనీరింగ్ కళాశాల, స్టేడియం, నిజాం షుగర్ ఫ్యాక్టరీ తెరిపించడం, కాళేశ్వరం ప్యాకేజీ 20, 21 పనుల పూర్తి వంటి వాటిపై తాము దృష్టి పెడతామని మహేశ్ కుమార్ పేర్కొన్నారు. కులగణన పూర్తయిన తర్వాతే స్థానిక సంస్థల ఎన్నికలకు వెళతామని స్పష్టం చేశారు. కాంగ్రెస్ పార్టీలో అంతర్గత క్రమశిక్షణ ఉంటుందని, మంత్రి కొండా సురేఖ అంశం, బాన్సువాడలో కాంగ్రెస్ ఇన్‌చార్జిలెవరు? అనే పలు అంశాలు తన దృష్టికి వచ్చాయని, వాటిని త్వరలోనే పరిష్కరిస్తామని పీసీసీ చీఫ్ పేర్కొన్నారు. మహేశ్ కుమార్ గౌడ్‌ను రాష్ట్ర సహకార యూనియన్ లిమిటెడ్ చైర్మన్, డీసీసీ అధ్యక్షుడు మానాల మోహన్‌రెడ్డి శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి, ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్ బిన్ హందాన్, పీసీసీ ప్రధాన కార్యదర్శి గడుగు గంగాధర్, నగర కాంగ్రెస్ అధ్యక్షుడు, నుడా చైర్మన్ కేశ వేణు, మార్కెట్ కమిటీ చైర్మన్ ముప్ప గంగారెడ్డి, ఆర్మూర్ ఇన్‌చార్జి వినయ్‌రెడ్డి, సిరిసిల్ల గ్రంథాలయ సంస్థ చైర్మన్ సత్యనారాయణ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్, పక్కన రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి

లింగ నిర్ధారణ కేసులో మరొకరిపై ఆరోపణలు

- ఆశావర్కర్ పాత్రపై విచారణ

రాజంపేట: లింగ నిర్ధారణ కేసులో విచారణ కొనసాగుతోంది. తాజాగా ఆశావర్కర్ పాత్రపై విచారణ జరిపారు. ఇటీవల రాజంపేట మండల కేంద్రంలో ఓ వ్యక్తి లింగ నిర్ధారణ పరీక్షలు చేస్తుండగా టాస్క్‌ఫోర్స్ పోలీసులు అరెస్ట్ చేసిన విషయం తెలిసిందే. ఈ కేసులో నిందితుడి సోదరి అయిన ఆశావర్కర్ పాత్ర కూడా ఉన్నట్లు ఆరోపణలు రావడంతో ఎంసీహెచ్ ప్రోగ్రాం ఆఫీసర్ అనురాధ ఆధ్వర్యంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారుల బృందం సోమవారం విచారణ చేపట్టింది. నిందితుడి సోదరితోపాటు గ్రామంలో పనిచేస్తున్న మొత్తం ఐదుగురు ఆశావర్కర్లను విచారించారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు విచారణ జరిగిందని మండల వైద్యాధికారి విజయ మహాలక్ష్మి తెలిపారు. ఆశా కార్యకర్తలు, ఏఎన్‌ఎం, వైద్య సిబ్బందితోపాటు గ్రామంలో పలువురు వ్యక్తులు, పోలీసుల నుంచి కూడా విచారణ బృందం సమాచారం సేకరించిందన్నారు. నివేదికను ఉన్నతాధికారులకు అందిస్తారన్నారు.



రాజంపేట పీహెచ్‌సీలో విచారణ జరుపుతున్న అధికారులు

క్లుప్తంగా

కలెక్టర్‌కు ప్రముఖుల దసరా శుభాకాంక్షలు

నిజామాబాద్‌అర్బన్: సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో సోమవారం పలువురు ప్రముఖులు కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతును కలిసి దసరా శుభాకాంక్షలు తెలిపారు. బోధన్, నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యేలు పి సుదర్శన్ రెడ్డి, ధన్‌పాల్ సూర్యనారాయణ, రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్ బిన్ హందాన్, రాష్ట్ర సహకార యూనియన్ చైర్మన్ మానాల మోహన్‌రెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అంతిరెడ్డి రాజిరెడ్డి తదితరులు కలెక్టర్‌ను కలిశారు.

జిల్లా హాకీ సీనియర్ క్రీడాకారుల ఎంపిక

ఆర్మూర్‌టౌన్: పట్టణంలోని బాలుర హైస్కూల్‌లో జిల్లా సీనియర్ పురుషుల హాకీ క్రీడాకారులను ఎంపిక చేసినట్లు జిల్లా హాకీ అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు విశాఖ గంగారెడ్డి, సదమస్తుల రమణ సోమవారం తెలిపారు. మొత్తం 40 మంది క్రీడాకారులు హాజరు కాగా, ప్రతిభ కనబర్చిన 18మంది క్రీడాకారులను ఎంపిక చేశామన్నారు. ఎంపికైన క్రీడకారులు త్వరలో తెలంగాణ హాకీ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని గచ్చిబౌలి స్టేడియంలో నిర్వహించే అంతర్ జిల్లాల హాకీ టోర్నీలో పాల్గొంటారన్నారు. హాకీ అసోసియేషన్ జిల్లా జాయింట్ సెక్రెటరీ మహ్మద్ ఆరిఫ్, సడక్ నగేశ్, పరంజ్యోతి, సీనియర్ కీడాకారులు పాల్గొన్నారు.

'ఖేలో ఇండియా'కు ఎంపిక



నిజామాబాద్ నాగారం: తమిళనాడు రాష్ట్రంలోని కోయంబత్తూర్‌లో ఈనెల 15 నుంచి 17వ తేదీ వరకు నిర్వహించను న్న ఖేలో ఇండియా సౌత్‌జోన్ నేషనల్ టోర్నమెంట్‌కు బాల్కొండ కేజీబీవీ విద్యార్థిని ఏలేటి మైథిలి ఎంపికైనట్లు ఉమ్మడి జిల్లా ఖోఖో అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు భూమారెడ్డి, ఎండీ అతీకుల్లా సోమవారం తెలిపారు. మైథిలిని ఉమ్మడి జిల్లా ఖో ఖో అసోసియేషన్ చైర్మన్ బిల్లా అనిల్, కోశాధికారి నోముల మధుసూదన్‌రెడ్డి, ఆర్గనైజింగ్ సెక్రెటరీ నాగేశ్వరరావు అభినందించారు.

పీడీఎస్ బియ్యం పట్టివేత



మాచారెడ్డి: ఓ వ్యాపారి అక్రమంగా నిల్వ చేసిన పీడీఎస్ బియ్యాన్ని పట్టుకున్నట్లు ఎస్సై అనిల్‌కుమార్ తెలిపారు. పాల్వంచమర్రికి చెందిన వ్యాపారి నంగునూరు శ్రీనివాస్ పీడీఎస్ బియ్యాన్ని అక్రమంగా నిల్వ చేశాడనే సమాచారం మేరకు దాడి చేసి 11క్వింటాళ్ల 10కిలోల బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నామన్నారు. శ్రీనివాస్‌పై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

ఫిర్యాదులను వెంటనే పరిష్కరించాలి

- కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్
- ప్రజావాణికి 49 వినతులు



ప్రజావాణిలో ఫిర్యాదులను స్వీకరిస్తున్న కలెక్టర్ సంగ్వాన్

కామారెడ్డి క్రైం: ప్రజావాణి ఫిర్యాదులను వెంటనే పరిష్కరించాలని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో సోమవారం జరిగిన ప్రజావాణి కార్యక్రమానికి మొత్తం 49 ఫిర్యాదులు వచ్చాయి. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. వచ్చిన ఫిర్యాదులను సంబంధిత శాఖల అధికారులు వెంటనే పరిశీలించి తగిన చర్యలు తీసుకోవాలన్నారు.గత వారం వరకు జిల్లా వ్యాప్తంగా 18,182 వినతులు వచ్చినట్లు తెలిపారు. వాటిని పరిశీలించిన సంబంధిత శాఖల అధికారులు 17,455 సమస్యలపై తగిన చర్యలు తీసుకున్నట్లు వెల్లడించారు. మిగతా 727 ఫిర్యాదుల్లో 533 పెండింగు లో ఉన్నాయని అన్నారు. ఆయా శాఖలకు చెందిన మరో 194 దరఖాస్తులను సంబంధిత శాఖలకు బదిలీ చేసినట్లు తెలిపారు.వినతులను ఎప్పటికప్పుడు ఆన్లైన్‌లో నమోదు చేయాలని అధికారులకు సూచించారు. సమస్యలకు పరిష్కార మార్గాలు చూపాలన్నారు.పెండింగ్ లేకుండా చూసుకోవాలన్నారు.

తాడ్వాయిలో ఫిర్యాదులు నిల్

తాడ్వాయి(ఎల్లారెడ్డి): స్థానిక తహసీల్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ఎలాంటి ఫిర్యాదులు రాలేదని తహసీల్దార్ రహిమొద్దీన్ తెలిపారు. ఈ ప్రజావాణికి పలు శాఖల అధికారులు హాజరయ్యారన్నారు. గ్రామాలలో ఏమైనా సమస్యలు ఉంటే ప్రజలు వచ్చే సోమవారం జరిగే ప్రజావాణిలో ఫిర్యాదులు చేసుకోవచ్చని సూచించారు. ఎంపీడీవో సయ్యద్ సాజీద్‌అలీ, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

సౌకర్యాలు కల్పించాలి



అధికారులకు సూచనలిస్తున్న కలెక్టర్

జిల్లా వ్యాప్తంగా ఏర్పాటు చేయనున్న ధాన్యం కొనుగోలు కేంద్రాలలో రైతులకు అన్ని రకాల సౌకర్యాలు కల్పించాలని కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్, అధికారులకు సూచించారు. ప్రజావాణి అనంతరం జిల్లా అధికారులతో సమావేశంలో మాట్లాడారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలన్నారు. జిల్లా స్థాయి అధికారులు కేంద్రాలను ఎప్పటికప్పుడు పరిశీలించాలని సూచించారు. కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శ్రీనివాస్ రెడ్డి, డీఆర్‌డీవో సురేందర్, జెడ్పీ సీఈవో చందర్ నాయక్, డీపీవో శ్రీనివాస్ రావు, ఏవో మసూర్ అహ్మద్, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

'ప్రతి గింజనూ ప్రభుత్వమే కొనుగోలు చేస్తుంది'



భూమి పూజ చేస్తున్న పోచారం శ్రీనివాస్ రెడ్డి, పక్కన ఆగ్రోస్ చైర్మన్ కాసుల బాల్‌రాజు

నస్రుల్లాబాద్(బాన్సువాడ): తెలంగాణ ప్రభుత్వం రైతులకు ఎటువంటి నష్టం జరగకూడదని భావించి, పండించిన ప్రతి గింజను కొనుగోలు చేస్తోందని రాష్ట్ర వ్యవసాయ సలహాదారులు, ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంలో సోమవారం పలు అభివృద్ధి కార్యక్రమాలకు ఆయన శంకుస్థాపన చేశారు. రూ.1.43 కోట్లతో పీహెచ్‌సీ భవన నిర్మాణం, రూ.17 లక్షలతో సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన చేశారు. నస్రుల్లాబాద్ సొసైటీ అధ్వర్యంలో కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఏ-గ్రేడ్ ధాన్యానికి రూ.2,320, బి-గ్రేడ్ ధాన్యానికి రూ.2,300 కొనుగోలు చేస్తుందన్నారు. ఆయన వెంట ఆగ్రోస్ చైర్మన్ కాసుల బాల్‌రాజ్, నాయకులు పెర్క శ్రీనివాస్, విఠల్, మాజిద్ ఖాన్, కంది మల్లేశ్, యూసుఫ్, తదితరులు పాల్గొన్నారు.

టీ తాగేందుకు వెళ్లి రోడ్డు ప్రమాదంలో మృతి

ఆర్మూర్‌టౌన్: మున్సిపాలిటీ పరిధిలోని పెర్కిట్ చౌరస్తావద్ద సోమవారం తెల్లావారు జామున 4గంటలకు జరిగిన రోడ్డు ప్రమాదంలో సుద్దపల్లి చిన్న గంగాధర్(55) అనే వ్యక్తి మృతిచెందాడు. పెర్కిట్ చౌరస్తాలోని హోటల్‌లో టీ తాగేందుకు గంగాధర్ బైక్‌పై వెళ్తుండగా వెనుకవైపు నుంచి వచ్చిన కారు ఢీకొట్టింది. ఈ ఘటనలో గంగాధర్ అక్కడికక్కడే మృతి చెందాడు. కారులో ఉన్న వ్యక్తులను పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. కేసు నమోదుచేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై గంగాధర్ తెలిపారు.

వాహనం అదుపుతప్పి..

నవీపేట: బైక్ అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొట్టిన ఘటనలో రెంజల్ మండలం బాగేపల్లికి చెందిన పాముల నవీన్(30) అనే వ్యక్తి మృతి చెందాడు. నవీపేట పోలీస్ స్టేషన్ పరిధిలోని జగ్గారావ్ ఫారం దగ్గర బాసర రహదారిపై సోమవారం సాయంత్రం ఈ ఘటన చోటు చేసుకుందని ఏఎస్సై మోహన్‌రెడ్డి తెలిపారు. కోస్లి లిఫ్ట్ పక్కన ఉన్న సబ్ స్టేషన్‌లో వాచ్‌మెన్‌గా పని చేస్తున్న నవీన్ పని నిమిత్తం బైక్‌పై నిజామాబాద్‌కు వెళ్లి తిరిగి వస్తుండగా బైక్ అదుపు తప్పి మృతి చెందాడన్నారు. మృతుడి భార్య లత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామన్నారు.



ఘటనాస్థలంలో నవీన్ మృతదేహం

గుర్తు తెలియని వాహనం ఢీకొని..

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): మండలంలోని రామక్కపల్లికి చెందిన జోడు సాయిలు(42) సోమవారం రాత్రి మండలంలోని రాఘవపల్లితండా వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతిచెందాడు. గ్రామస్తులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. సాయిలు టీవీఎస్ ఎక్సెల్‌పై రామక్కపల్లికి వెళ్తుండగా గుర్తు తెలియని వాహనం ఢీకొట్టింది. తీవ్రగాయాల పాలైన సాయిలును ఎల్లారెడ్డి ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు.

స్మార్ట్ సిటీతో నిజామాబాద్ అభివృద్ధి

- పూలాంగ్ ప్రక్షాళన జరగాలి
- టీపీసీసీ చీఫ్ బొమ్మ మహేశ్‌కుమార్ గౌడ్



భవనాన్ని ప్రారంభిస్తున్న మహేశ్‌కుమార్‌గౌడ్

నిజామాబాద్ సిటీ: నిజామాబాద్ నగర అభివృద్ధి స్మార్ట్ సిటీతోనే మరింత వేగవంతమవుతుందని, అందుకు కృషి చేస్తామని టీపీసీసీ చీఫ్ బొమ్మ మహేశ్‌కుమార్‌గౌడ్ అన్నారు. నగరంలోని ఎల్లమ్మగుట్టలో రేణుకా ఎల్లమ్మ గౌడసంఘం భవనం పైఅంతస్తులను సోమవారం ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఎన్నికల వరకే రాజకీయాలని, ఆ తరువాత అంతా కలిసి నగర అభివృద్ధి దృష్టిసారిద్దామన్నారు. పార్టీలకు అతీతంగా నగర అభివృద్ధికి ముందుకు రావాలని సూచించారు. నిజామాబాద్ తరువాత మున్సిపాలిటీలుగా మారిన కరీంనగర్, ఇతర ప్రాంతాలు వేగంగా అభివృద్ధి చెందాయన్నారు. రైల్వే బ్రిడ్జీలకు కేంద్రం నుంచి తగినన్ని నిధులు కేటాయించి వాటిని పూర్తిచేసేలా చూడాలని ఎంపీ అరవింద్‌కు సూచించారు. ఎల్లమ్మగుట్ట వద్దనున్న రైల్వే బ్రిడ్జిని త్వరలో పూర్తిచేస్తామన్నారు. హైదరాబాద్‌లో హైడ్రా తరహాలో నిజామాబాద్‌లో నిడ్రా రావాల్సిన అవసరం ఉందన్నారు. పూలాంగ్‌వాగు ప్రక్షాళన జరిగి తీరాల్సిందేనన్నారు. ఈ బృహత్ కార్యక్రమంలో పేదలు తమ ఇళ్లు నష్టపోతే వారికి నివాస స్థలం కల్పిస్తామన్నారు. నాలాలు ఆక్రమించిన బడాబాబులను మాత్రం ఉపేక్షించబోమని హెచ్చరించారు. జిల్లా కేంద్రంలో గౌడ సంఘం నిర్మాణానికి తనవంతు కృషిచేస్తానని హామీ ఇచ్చారు. డివిజన్ సమస్యలను స్థానిక కార్పొరేటర్ న్యాలం రాజు పీసీసీ చీఫ్ దృష్టికి తీసుకువచ్చారు. కాంగ్రెస్ నాయకులు మానాల మోహన్‌రెడ్డి, ముప్ప గంగారెడ్డి, కేశ వేణు, పంచరెడ్డి సుదర్శన్, మహ్మద్ ఖైసర్, తదితరులు పాల్గొన్నారు.

నిజామాబాద్‌అర్బన్: పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్‌ను పులువురు గిరిరాజ్ కళాశాల పూర్వ విద్యార్థులు మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు. ఈ సందర్భంగా ఆయనకు దసరా శుభాకాంక్షలు తెలిపారు. కళాశాల అభివృద్ధికి సహకరించాలని కోరారు. గిరిరాజ్ కళాశాల మాజీ అధ్యక్షుడు కోనేరు సాయికుమార్, సెక్రెటరీ సీతయ్య, కేశపురం రమేశ్, సాయిలు, నగేశ్, రాజు, హన్మాండ్లు, లక్ష్మణ్ పాల్గొన్నారు.

ప్రజావాణికి 51 ఫిర్యాదులు



నిజామాబాద్‌అర్బన్: సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో 51 ఫిర్యాదులు అందాయి. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ఫిర్యాదుదారులు తమ సమస్యలను మున్సిపల్ కమిషనర్ మకరంద్, కలెక్టరేట్ ఏవో ప్రశాంత్‌కు విన్నవిస్తూ అర్జీలు సమర్పించారు. ప్రజావాణి కార్యక్రమానికి ప్రాధాన్యతనిస్తూ ఫిర్యాదులను త్వరితగతిన పరిష్కరించాలని కమిషనర్ మకరంద్ అధికారులకు సూచించారు. అర్జీలను పెండింగ్‌లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిశీలించి సమస్యలను పరిష్కరించాలని అన్నారు. వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

పరిస్థితి విషమించి మహిళ..

- ఐసీయూలో భర్త పరిస్థితి విషమం

బాన్సువాడ రూరల్: రోడ్డు ప్రమాదంలో భార్యాభర్తలు గాయాపాలుకాగా, చికిత్స పొందుతూ పరిస్థితి భార్య మృతి చెందింది. భర్త ఐసీయూలో చికిత్స పొందుతున్నాడు. వివరాలు ఇలా ఉన్నాయి.. హన్మాజీపేటకు చెందిన భార్యాభర్తలు మూడ భాగ్యలక్ష్మి, జనార్దన్ ఈనెల 11న గాలీపూర్ నుంచి ద్విచక్రవాహనంపై వస్తుండగా తిర్మలాపూర్ సమీపంలో ఎల్లారెడ్డి–బాన్సువాడ ప్రధాన రహదారిపై ఎదురుగా వస్తున్న ఆటో ఢీకొట్టింది. ఈ ఘటనలో భార్యాభర్తలకు తీవ్రగాయాలు కాగా, బాన్సువాడ ప్రభుత్వ ఆస్పత్రిలో ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం నిజామాబాద్‌కు తరలించారు. భాగ్యలక్ష్మి (40) పరిస్థితి విషమించి సోమవారం మృతి చెందగా, జనార్దన్ ఐసీయూలో చికిత్స పొందుతున్నాడు.వీరికి ఇద్దరు పిల్లలు ఉన్నారు. బాన్సువాడ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.



భాగ్యలక్ష్మి (ఫైల్)

సర్వీస్ రోడ్డుపై లారీ బోల్తా



రామారెడ్డి: రామారెడ్డి గంగమ్మ వాగు సర్వీస్ రోడ్డు మీదుగా కామారెడ్డి వైపు ధాన్యం లోడ్‌తో వెళ్తున్న లారీ అదుపు తప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదం రామారెడ్డి శివారులో గంగమ్మ వాగు వద్ద సోమవారం చోటుచేసుకుంది. సోమవారం ఉదయం పూట ధాన్యం లారీ మట్టి రోడ్డుపై నుంచి వెళ్లడంతో మట్టి రోడ్డు కుంగిపోయి లారీ బోల్తా కొట్టింది. ఈ ఘటనలో ఎవరికి గాయాలు కాలేదు. రామారెడ్డి నుంచి గర్గుల్ వచ్చే దారిలో గంగమ్మ వాగు ప్రమాదకరంగా ఉండటంతో బ్రిడ్జి నిర్మాణం చేపడుతున్నారు. బ్రిడ్జి నిర్మాణంలో తీవ్ర జాప్యంగా కారణంగా వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఆటోలు, ద్విచక్ర వాహనాలు మాత్రమే సర్వీస్ రోడ్డు మీదుగా రాకపోకలు సాగిస్తున్నాయి. బస్సులు, పెద్ద వాహనాలు వయా పోసానిపేట, సదాశివనగర్ మీదుగా ప్రయాణించాల్సిందే. బ్రిడ్జి పక్కన వాహనాలు వెళ్లేలా ఉన్న మట్టి రోడ్డు ప్రమాదాలకు నిలయంగా మారుతోంది.

క్రైం కార్నర్

వేర్వేరు ప్రాంతాల్లో ఐదుగురి ఆత్మహత్య

ఉమ్మడి జిల్లాలోని వేర్వేరు ప్రాంతాలకు చెందిన ఐదుగురు ఆత్మహత్య చేసుకున్నారు. అదనపు కట్నం కోసం భర్త వేధిస్తుండడంతో ఓ మహిళ, అనారోగ్యంతో బాధపడుతూ జీవితంపై విరక్తి చెందిన మరో మహిళ ఉరేసుకున్నారు. కూతురి పెళ్లికి అప్పులు చేసిన ఓ తండ్రి యంచ వద్ద.. భార్య మరణాన్ని తట్టుకోలేక భర్త కందకుర్తి వద్ద గోదావరిలో దూకి బలవన్మరణానికి పాల్పడ్డారు. హైదరాబాద్‌లో కూలీ పని చేసుకునే మరో యువకుడు అనారోగ్యం కారణంగా ఉరేసుకున్నాడు.

కూతురికి ఫోన్ చేసి గోదావరిలో దూకిన తండ్రి

నవీపేట: మండలంలోని అనంతగిరి గ్రామానికి చెందిన జీవన్‌రెడ్డి(57) సోమవారం తెల్లవారు జామున యంచ వద్ద గోదావరిలో దూకి ఆత్మహత్య చేసుకున్నట్లు ఏఎస్సై మోహన్‌రెడ్డి తెలిపారు. ఆయన తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. ఆటో నడుపుతూ జీవించే జీవన్‌రెడ్డి నాలుగేళ్ల కిందట కూతురు సవిత పెళ్లి కోసం అప్పు చేశాడు. అప్పుల బాధతో మనస్తాపానికి గురైన ఆయన తెల్లవారుజామున గోదావరి బ్రిడ్జి పైకి వచ్చి కూతురికి ఫోన్ చేశాడు. తాను ఆత్మహత్య చేసుకుంటున్నట్లు తెలిపి గోదావరిలో దూకాడు. మృతుడికి భార్య లావణ్య, కొడుకు సంపత్‌రెడ్డి ఉన్నారు. మృతుడి కొడుకు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై తెలిపారు.

అనారోగ్యంతో బాధపడుతున్న మహిళ..

బిచ్కుంద(జుక్కల్): అనారోగ్యంతో బాధపడుతున్న మండలంలోని వాజిద్‌నగర్‌కు చెందిన యెల్లుట్ల సుమలత(36) ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై మోహన్‌రెడ్డి తెలిపారు. అనారోగ్యంతో బాధపడుతున్న సుమలత జీవితంపై విరక్తి చెంది ఆదివారం సాయంత్రం దూలానికి ఉరేసుకుందన్నారు. మృతురాలి భర్త సాయిలు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

మోతెకు చెందిన యువకుడు..

లింగంపేట(ఎల్లారెడ్డి): మండలంలోని మోతె గ్రామానికి చెందిన గాధం ప్రణీత్(20) ఆదివారం రాత్రి ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై అరుణ్‌కుమార్ తెలిపారు. హైదరాబాద్‌లో కూలీ పని చేసుకుంటూ జీవిస్తున్న ప్రణీత్, దసరా పండుగ కోసం స్వగ్రామానికి వచ్చాడని, కొంత కాలంగా కడుపునొప్పి, అనారోగ్యంతో బాధపడుతున్న అతడు, రాత్రి ఇంట్లో అందరూ నిద్రిస్తున్న సమయంలో చీరతో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడన్నారు. మృతుడి తండ్రి సాయిలు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.



ప్రణీత్ (ఫైల్)

భార్య మరణాన్ని జీర్ణించుకోలేక..



మీసాలే లక్ష్మణ్ (ఫైల్)

రెంజల్(బోధన్): భార్య మరణాన్ని జీర్ణించుకోలేక భర్త ఆత్మహత్య చేసుకున్నాడు. వివరాలు ఇలా ఉన్నాయి.. బోధన్ మండలం ఖండ్‌గాం గ్రామానికి చెందిన మీసాలే లక్ష్మణ్(26) భార్య ఆరు నెలల క్రితం మృతి చెందింది. ఇద్దరు పిల్లలతో సాటాపూర్‌లో ఉంటున్న బావ వద్దకు వచ్చిన లక్ష్మణ్ ఆటో నడుపుతూ జీవిస్తున్నాడు. భార్య మరణంతో మనస్తాపానికిగురైన లక్ష్మణ్‌కు ఆర్థిక ఇబ్బందులు ఎక్కువయ్యాయి. శనివారం ఇంటి నుంచి బయటికి వెళ్లిన లక్ష్మణ్ తిరిగిరాకపోవడంతో అతడి బావ ఆదివారం ఉదయం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. నది ఒడ్డున వాహనం నిలిపి ఉన్నట్లు గుర్తించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించగా, ఆ వాహనం లక్ష్మణ్‌ది అని నిర్ధారించారు. గోదావరిలో గాలించినప్పటికీ లక్ష్మణ్ ఆచూకీ లభించలేదు. సోమవారం నదిలో మృతదేహం కనిపించడంతో గుర్తించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. జాలర్లతో మృతదేహాన్ని బయటకు తీయించిన పోలీసులు లక్ష్మణ్ కుటుంబసభ్యులకు సమాచారం అందించారు.

భర్త వేధింపులు తాళలేక..



మనోజ(ఫైల్)

ఇందల్వాయి: అదనపు కట్నం కోసం భర్త వేధిస్తుండడంతో భార్య ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలంలోని చంద్రాయన్‌పల్లిలో సోమవారం చోటు చేసుకుంది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. సదాశివనగర్ మండలం గిద్ద గ్రామానికి చెందిన వేముల మనోజకు డిచ్‌పల్లికి చెందిన సాయిలుతో వివాహమైంది. వారికి ఇద్దరు కుమారులు ఉన్నారు. డ్రైవర్ అయిన సాయిలు కొద్ది కాలంగా వివిధ రకాల వాహనాలు నడుపుతూ చంద్రాయన్‌పల్లిలో నివాసం ఉంటున్నాడు. సాయిలు మనోజని అదనపు కట్నం కోసం వేధిస్తుండడంతో మనస్తాపానికి గురైన ఆమె ఇంటి సమీపంలోని చెట్టుకు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకుంది. మృతురాలి అన్న సంతోష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై మనోజ్‌కుమార్ తెలిపారు.

యువకుడిపై కత్తితో దాడి

ఆర్మూర్‌టౌన్: మున్సిపాలిటీ పరిధిలోని మామిడిపల్లి విద్యానగర్‌లో ఆదివారం అర్ధరాత్రి వరుణ్ అనే యువకుడిపై మరో యువకుడు కత్తితో దాడి చేశాడు. స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. దుర్గామాత శోభాయాత్రలో వరుణ్ ఓ యువతిని టీజ్ చేశాడు. ఇదివరకే నిశ్చితార్థం అయిన ఆ యువతి తనకు కాబోయే భర్తకు విషయం తెలిపింది. అక్కడికి చేరుకున్న యువతికి భర్త శోభాయాత్రలో నృత్యం చేస్తున్న వరుణ్‌పై కత్తితో దాడి చేశాడు. గాయలపాలైన వరుణ్‌ను చికిత్స నిమిత్తం ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. దాడికి పాల్పడిన యువకుడిపై బాధిత కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

కాలువలో గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం

వర్ని: చందూర్ గ్రామ శివారులో నిజాంసాగర్ ప్రధాన కాలువలో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం ఉన్నట్లు స్థానికులు సోమవారం సాయంత్రం సమాచారం అందించారని ఎస్సై కృష్ణకుమార్ తెలిపారు. మృతుడి వయస్సు సుమారు 28 ఏళ్లు ఉంటుందని, బ్లాక్ కలర్ ప్యాంటు, ఎల్లో కలర్ షర్ట్ ఉందన్నారు. మృతుడి సంబంధీకులు ఎవరైనా ఉంటే పోలీస్‌స్టేషన్‌లో సంప్రదించాలని సూచించారు.

డీజే నిర్వాహకులపై కేసు

బోధన్‌టౌన్(బోధన్): పోలీసుశాఖ నిబంధనలకు విరుద్ధంగా దేవీమాత శోభాయాత్రలో డీజేలు ఏర్పాటు చేసిన భారత్, ఎంఎస్ డీజే సౌండ్ సిస్టమ్ నిర్వాహకులిద్దరిపై కేసు నమోదు చేసినట్లు పట్టణ సీఐ వెంకటనారాయణ తెలిపారు. సోమవారం నిర్వహించిన దేవీమాత శోభాయాత్రలో డీజే ఏర్పాటు చేసిన ఇద్దరిపై కేసు నమోదు చేశామన్నారు.

తాళం వేసిన ఇంట్లో చోరీ



గాంధారి(ఎల్లారెడ్డి): మండలంలోని జువ్వాడి గ్రామంలో తాళం వేసిన ఇంట్లో చోరీ జరిగినట్లు ఎస్సై ఆంజనేయలు సోమవారం తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి.. గ్రామానికి చెందిన వడ్ల పండరి కుటుంబ సభ్యులతో కలిసి పది రోజుల క్రితం ఇంటికి తాళం వేసి వేరే గ్రామంలోని తన కూతురి వద్దకు వెళ్లాడు. సోమవారం గ్రామానికి తిరిగి వచ్చే సరికి ఇంట్లోని బీరువా తాళాలు పగుల గొట్టి ఉన్నాయి. ఇంటి తాళం పగుల గొట్టకుండా దుండగులు ఇంట్లోకి ఎలా ప్రవేశించారనే అనుమానంతో అదే గ్రామానికి చెందిన తమ బంధువులు వడ్ల విజయ్, వడ్ల శ్రీకాంత్‌పై అనుమానంతో పండరి గ్రామస్తుల సహకారంతో ప్రశ్నించారు. దాబాపై నుంచి ఇంట్లోకి ప్రవేశించి బీరువాలో దాచిన ఉంచిన 10 తులాల వెండి, పూజ గదిలోని ఇత్తడి, రాగి వస్తువులు, బిందెలను దొంగిలించిన్లు వారు ఒప్పుకున్నారు. బాధితుల ఫిర్యాదు మేరకు ఎస్సై ఆంజనేయలు ఘటనాస్థలాన్ని పరిశీలించి వివరాలు సేకరించారు.

రేణుక ఎల్లమ్మ ఆలయంలో..



ఎల్లారెడ్డిరూరల్(ఎల్లారెడ్డి): ఎల్లారెడ్డి మున్సిపాలిటీ పరిధి గండిమాసానిపేటలోని రేణుక ఎల్లమ్మ ఆలయంలో ఆదివారం రాత్రి చోరీ జరిగినట్లు గ్రామస్తులు తెలిపారు. దొంగలు ఆలయ గేట్లు పగలకొట్టి లోనికి వెళ్లి బీరువా తాళాలను ధ్వంసం చేశారని వారు తెలిపారు. తాళాలను పగలకొట్టి హుండీలోని నగదును తీసుకెళ్లినట్లు వారు తెలిపారు. చోరీ విషయమై పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

చేపలు పట్టేందుకు వెళ్లిన వ్యక్తి గుండెపోటుతో మృతి

ఎల్లారెడ్డి: లక్ష్మాపూర్ గ్రామానికి చెందిన ముదాం బాలరాజు(55) అనే వ్యక్తి చేపలు పట్టేందుకు వెళ్లి గుండెపోటుతో మృతి చెందినట్లు గ్రామస్తులు తెలిపారు. గ్రామానికి చెందిన బాలరాజు గ్రామ శివారులోని చెరువులో చేపలు పట్టేందుకు మిత్రులతో కలిసి వెళ్లగా.. చెరువులో ఉండగానే గుండె నొప్పి వస్తుందని బాలరాజు తెలపడంతో వెంటనే ఆయనను ఆస్పత్రికి తరలించారు. మార్గమధ్యలో మృతి చెందినట్లు గ్రామస్తులు తెలిపారు.

మాచాపూర్‌కు చెందిన ఒకరి అదృశ్యం



సాయిలు

ఎల్లారెడ్డిరూరల్(ఎల్లారెడ్డి): మండలంలోని మాచాపూర్ గ్రామానికి చెందిన మాచబోయిన సాయిలు (42) అనే వ్యక్తి అదృశ్యమైనట్లు ఎస్సై మహేశ్ సోమవారం తెలిపారు. పొలం వద్దకు వెళ్తానని చెప్పి ఇంటి నుంచి బయటికి వెళ్లిన సాయిలు తిరిగిరాకపోవడంతో కుటుంబ సభ్యులు పలుచోట్ల వెతికారు. సాయిలు ఆచూకీ లభించకపోవడంతో అతడి కూతురు మౌనిక ఫిర్యాదు చేసిందని, కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

జిల్లాకేంద్రానికి చెందిన మహిళ..



కెంగర్ల నిర్మల

కామారెడ్డి క్రైం: జిల్లా కేంద్రంలోని రాజీవ్ నగర్ కాలనీకి చెందిన కెంగర్ల నిర్మల అనే మహిళ అదృశ్యమైనట్లు పట్టణ ఎస్‌హెచ్‌వో చంద్రశేఖర్‌రెడ్డి సోమవారం తెలిపారు. మతిస్థిమితం లేని నిర్మల ఈనెల 7న ఇంటి నుంచి బయటికి వెళ్లి తిరిగిరాకపోవడంతో ఆమె తండ్రి మల్లయ్య పలుచోట్ల వెతికినా ఆచూకీ లభించలేదు. దీంతో పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌హెచ్‌వో తెలిపారు.